RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...




నదులకు జలకళ

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.

ఎడిటర్ : బిర్రు కరుణాకర్

Cell: 9701249103

సంపుటి - 1 సంచిక - 195 శనివారం 20 జూలై 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



# పోటెత్తుతున్న వరద..

**హుస్సేన్ సాగర్ పూర్తి నీటిమట్టం 514 అడుగులు**
**ప్రస్తుత నీటిమట్టం 513.21 అడుగులు**
**మరో మూడు రోజులు తెలంగాణకు భారీ వర్ష సూచన**

**హైదరాబాద్,జులై 19,(జర్నలిస్ట్ వార్త):** :భారీగా కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ లోని హుస్సేన్ సాగర్ కు వరద పోటెత్తుతోంది. వరద నీటితో హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. సాగర్ పూర్తి నీటిమట్టం 514 అడుగులు కాగా... ప్రస్తుత నీటిమట్టం 513.21 అడుగులుగా ఉంది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. సాగర్ లోకి చేరుతున్న వరదనీటిని కిందికి వదిలేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. మూసీ నది పరీవాహక ప్రాంతంలో ఉన్న జనాలు కూడా అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు. మరోవైపు భారీ వర్షాల కారణంగా తెలంగాణలోని పలు జిల్లాల్లోని చెరువులు, కుంటలు నిండిపోయాయి. వాగులు వరద నీటితో పోటెత్తుతున్నాయి. రానున్న మూడు రోజులు కూడా తెలంగాణలో కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. హైదరాబాద్ లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది.



# సరికొత్త విద్యావిధానం

**రెసిడెన్షియల్ పాఠశాలలపై రేవంత్ సమీక్ష**

- పిల్లలందరూ స్వంత
- గ్రామాలలోనే ఇక చదువు
- మూడేళ్ళలో ప్రభుత్వ పాఠశాల
- పటిష్టతకు చర్యలు
- 3వ తరగతి వరకు అంగన్
- వాడీల్లోనే ప్లేస్కూల్ తరహా బోధన
- 4 నుంచి సెమీ రెసిడెన్షియల్స్..
- విద్యార్థులకు రవాణా సదుపాయం
- విద్యావేత్తలతో చర్చించి
- ప్రణాళికలు రూపొందిచాలని
- విద్యాశాఖకు ముఖ్యమంత్రి
- ఆదేశాలు

**జులై 19,(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను, విద్యా వ్యవస్థను పటిష్టం చేసే దిశగా సరికొత్త విధానంతో ముందుకు వెళ్లాలని విద్యా శాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వచ్చే మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని విద్యాశాఖ ముఖ్య కారదర్శి బుర్రా వెంకటేశం , ఇతర అధికారులకు సీఎం సూచించారు.
ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ కు సమాంతరంగా అన్ని చోట్లా సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్ కొనసాగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తో కలిసి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ పై విద్యా శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో సీఎం ఈ మేరకు సూచనలు చేశారు.

అంగన్ వాడీలకు సింగిల్ టీచర్
చిన్న పిల్లలకు సొంత గ్రామాల్లోనే సౌకర్యవంతంగా ఉండేలా ప్లే స్కూల్ తరహాలో 3వ తరగతి వరకు అంగన్ వాడీ కేంద్రాలలోనే విద్యాబోధన చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అంగన్ వాడీలలో ఇప్పుడున్న సిబ్బందికి అదనంగా విద్యా బోధన కోసం ప్రత్యేకంగా ఒక టీచర్ నియమించేలా ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు.

# ఫండ్స్ డైవర్షన్ కోసమే



- ఏడు నెలలు ఏమార్చి చేసిన రుణమాఫీ
- చారాణ కోడికి బారాణ మసాలా వలె ఉందన్న కేటీఆర్
- రుణమాఫీ అయిన రైతుల కంటే కంటతడి పెట్టిన
- కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయని వ్యాఖ్య
- మెజార్టీ రైతుల్లో నిరాశ మిగిల్చినందుకు సంబరాలు
- చేసుకుంటున్నారా? అని ప్రశ్న

**హైదరాబాద్, జులై 19,(జర్నలిస్ట్ వార్త):**
రుణమాఫీపై రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. ఇంతకాలం అటెన్షన్ డైవర్షన్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఫండ్స్ డైవర్షన్ చేస్తోందని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు.'సీఎం గారు... ఊరించి.. ఊరించి.. ఏడునెలలు ఏమార్చి చేసిన.. మీ రుణమాఫీ తీరు చూస్తే.. తెలంగాణ ప్రజలకు గుర్తొచ్చిన సామెత ఒక్కటే.. చారాణ కోడికి..! బారాణ మసాలా...!!' అన్నట్లుగా ఉందన్నారు. రుణమాఫీ అయిన రైతుల కన్నా కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలు.. రైతుమాఫీ పథకానికి మరణ శాసనాలు అయ్యాయన్నారు. అన్నివిధాలా అర్హత ఉన్నా.. ఎందుకు రుణమాఫీ కాలేదో చెప్పెటోడు లేడన్నారు. రైతులు గోడు చెప్పుకుందామంటే వినేటోడు కూడా లేడన్నారు. ?

మిగతాది 2లో...

# గ్రూప్-2 పరీక్షలవాయిదా


**ఆగస్ట్ 7, 8 తేదీల్లో జరగాల్సిన పరీక్షలు డిసెంబర్ లో నిర్వహిస్తామని ప్రభుత్వ ప్రకటన**

**నిరుద్యోగుల డిమాండ్లు, ఆందోళనల నేపథ్యంలో పరీక్షలు వాయిదా**

**హైదరాబాద్, జులై 19,(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో గ్రూప్-2 పరీక్షలు వాయిదా పడ్డాయి. షెడ్యూల్ ప్రకారం ఈ పరీక్షలు ఆగస్ట్ 7, 8 తేదీల్లో జరగాల్సి ఉంది. డిసెంబర్ నెలకు పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి 2022 డిసెంబర్ లో టీఎస్పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే పలు కారణాల వల్ల పరీక్షల నిర్వహణ వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా పరీక్షలను డిసెంబర్ కు వాయిదా వేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. వాస్తవానికి ఆగస్ట్ 7, 8 తేదీల్లోనే పరీక్షలను నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్లు వచ్చాయి. డీఎస్సీ పరీక్షలు జులై 18 నుంచి ఆగస్ట్ 5 వరకు ఉండటం... ఆ వెంటనే గ్రూప్-2 పరీక్షలు ఉండటంతో నిరుద్యోగుల నుంచి వ్యతిరేకత వచ్చింది.




నిరుద్యోగులు ఛలో సెక్రటేరియట్ తో పాటు పలు ధర్నాలు నిర్వహించారు. దీంతో, ప్రభుత్వం పరీక్షలను వాయిదా వేసింది.



# విండోస్ క్రాష్

2లో.

- ఇంటర్నెట్ ప్రపంచంలో అతిపెద్ద ఉపద్రవం!
- శంషాబాద్‌లో 36 విమాన సర్వీసుల రద్దు
- 7-8 గంటలపాటు ప్రయాణికుల పడిగాపులు
- బ్లూస్క్రీన్ ఎర్రర్‌తో విండోస్ సేవల్లోఅంతరాయం
- హైరానా సృష్టించిన 'మైక్రోసాఫ్ట్' సాంకేతిక సమస్య
- 'క్రౌడ్‌స్ట్రైక్' అప్‌డేట్ వల్ల ఊహించని ఉపద్రవం
- ప్రపంచవ్యాప్తంగా ఆటోమేటిగ్గా సిస్టమ్‌ల షట్ డౌన్
- ఇంటర్నెట్ వాడే అన్ని రంగాలపైనా తీవ్ర ప్రభావం

# వ్యవసాయ భూముల్లో మైనింగ్

**- పట్టపగలే యదేచ్ఛగా ఇసుక తవ్వకాలు**




# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన ..!




**హైదరాబాద్, జులై 19,(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటూ అమెరికాలోని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు అధికారుల బృందం అమెరికాలో పర్యటించనుంది. వచ్చే నెల 3న రాత్రి హైదరాబాద్ నుంచి ఈ బృందం అమెరికా వెళుతుంది. డాలస్ సహా వివిధ రాష్ట్రాలలో పర్యటించి, తెలంగాణకు పెట్టుబడులను ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తుంది. అమెరికా పారిశ్రామికవేత్తలను కలిసి తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, ప్రభుత్వ విధానాలను వివరించనుంది. సీఎం రేవంత్ రెడ్డి బృందం వారం రోజుల పాటు అమెరికాలో పర్యటించనుంది. ఈ టూర్ లో పలు కంపెనీల సీఈవోలు, పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అవుతారు. సీఎం తన పర్యటన ముగించుకుని ఆగస్టు 11న హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు.

# విండోస్ క్రాష్

హైదరాబాద్, జులై 19,(జర్నలిస్ట్ వార్త):
బ్యాంకింగ్, విమానయాన, ఐటీ సేవల్లో తీవ్ర అంతరాయం కలిగింది. కొన్ని విమానాలు రద్దయ్యాయి. ఇంకొన్ని ఆలస్యమయ్యాయి. కొన్ని చోట్ల ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలు సైతం నిలిచిపోయాయి. దీంతో అంతటా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. విండోస్ 10, 11 ఆపరేటింగ్ సిస్టమ్‌లలో ప్రధానంగా సమస్య తలెత్తింది. విండోస్ 7 ఓఎస్‌తో నడిచే సిస్టమ్‌లు యథావిధిగా పని చేశాయి. మ్యాక్, లైనెక్స్ సిస్టమ్‌లకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. మైక్రోసాఫ్ట్‌పై సైబర్ దాడి జరిగిందనే ప్రచారం జరిగింది. దీంతో వినియోగదారుల్లో ఆందోళన మొదలయ్యింది. అనేక గంటల పాటు శ్రమించిన నిపుణులు చివరకు సమస్యకు పరిష్కారాన్ని కనుగొన్నారు. కంప్యూటర్లు మళ్లీ ఎలా ఆన్ చేయాలో వినియోగదారులకు మైక్రోసాఫ్ట్ సూచనలు చేసింది.




## ఎందుకు జరిగింది?

మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులైన విండోస్ 10,11 వెర్షన్‌లలో, క్లౌడ్ సర్వీసులతో నడిచే పీసీలు, ల్యాప్‌టాప్‌లు, మైక్రోసాఫ్ట్ 365 యాప్స్, సర్వీసుల్లోనూ ఇటీవల చేపట్టిన క్రౌడ్‌స్ట్రైక్ సెక్యూరిటీ అప్‌డేట్ కారణంగానే 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్ (బీఎస్‌వోడీ)' సమస్య తలెత్తినట్లు మైక్రోసాఫ్ట్ వెల్లడించింది. 'క్రౌడ్‌స్ట్రైక్' అనేది అమెరికాకు చెందిన ఓ సైబర్ సెక్యూరిటీ సంస్థ.

ఇది 2011లో ఏర్పాటైంది. మైక్రోసాఫ్ట్‌తో పాటు దిగ్గజ సంస్థలకు అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీని అందిస్తుంటుంది. తాజాగా విండోస్ సిస్టమ్స్‌లో నెలకొన్న బ్లూ స్క్రీన్ ఎర్రర్‌కు తామిచ్చిన తాజా సెక్యూరిటీ అప్‌డేట్ 'ఫాల్కన్ సెన్సర్'లో ఓ బగ్ కారణమని క్రౌడ్‌స్ట్రైక్ కూడా అంగీకరించింది.

## స్తంభించిన ప్రపంచం!

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా భారత్ మాత్రమే కాదు అమెరికా, ఆస్ట్రేలియా, ఐరోపా దేశాల్లో ప్రభుత్వ, ప్రైవేటు, శాంతి-భద్రతలు, బ్యాంకింగ్, ఐటీ, రైల్వే, దవాఖాన, మీడియా, పేమెంట్ సర్వీసులు, స్టాక్ మార్కెట్లు, విమానయానం ఇలా దాదాపు అన్ని రంగాలు ప్రభావితమయ్యాయి. విండోస్‌లో సమస్య కారణంగా బ్రిటిష్ న్యూస్ ఛానెల్ స్కైన్యూస్ వార్తలను ఎయిర్ చేయడంలో అవాంతరాలు ఎదుర్కొన్నది. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో సమస్యలు తలెత్తాయి. అక్కడి మెట్రో సర్వీసులు సైతం నిలిచిపోయాయి. జర్మనీ, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ ఇలా ఐరోపాలోని అన్ని దేశాలపై ప్రభావం పడింది. ఆస్ట్రేలియాలోని వూల్‌వర్త్స్ అనే సూపర్ మార్కెట్ సేవల్లోనూ అంతరాయం తలెత్తింది. పాయింట్ ఆఫ్ సేల్స్‌లో కస్టమర్ల బ్యాంకు కార్డులు కూడా పనిచేయడం లేదు.

ఏబీసీ న్యూస్ 24 బ్రాడ్‌క్యాస్టింగ్‌లోనూ సమస్యలు ఏర్పడ్డాయి. ఆస్ట్రేలియావ్యాప్తంగా ఉన్న పోలీసు స్టేషన్లలోని సిస్టమ్‌లు మొరాయించాయి. ప్రపంచవ్యాప్తంగా పలు విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. విమాన సేవలు ఆలస్యం, క్యాన్సిలేషన్లు పెరిగాయి. మెల్‌బోర్న్, వర్జిన్ ఆస్ట్రేలియా, సిడ్నీ ఎయిర్‌పోర్ట్‌లో పలు విమానాలు నిలిచిపోయాయి. అమెరికాలో డెల్టా ఎయిర్‌లైన్స్, యూనైటెడ్ ఎయిర్‌లైన్స్, అమెరికన్ ఎయిర్‌లైన్స్, ఫ్రంటీయర్ ఎయిర్‌లైన్స్ సంస్థలు కొన్ని విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇక ఐటీ, ఐటీఈఎస్, ప్రైవేటు కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. బ్యాంకులు, దవాఖాన, మీడియాపైనా ప్రభావం పడింది. కొన్ని దేశాల్లో ఆన్‌లైన్‌తో అనుసంధానమై ఉన్న పోలీసుల వ్యవస్థలు క్రాష్ అయ్యాయి.

## క్రౌడ్‌స్ట్రైక్ అప్‌డేట్ వల్లే: సత్య నాదెళ్ల

మైక్రోసాఫ్ట్‌లో అంతరాయంపై ఈ సంస్థ సీఈవో సత్య నాదెళ్ల స్పందించారు. 'క్రౌడ్‌స్ట్రైక్ విడుదల చేసిన ఒక అప్‌డేట్ ప్రపంచవ్యాప్తంగా ఐటీ వ్యవస్థలను ప్రభావితం చేయడం ప్రారంభించింది. ఈ సమస్య గురించి మాకు అవగాహన ఉంది. మళ్లీ సిస్టమ్‌లను సురక్షితంగా ఆన్‌లైన్‌లోకి తీసుకురావడం కోసం వినియోగదారులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు అందించేందుకు క్రౌడ్‌స్ట్రైక్‌తో కలిసి పని చేస్తున్నాం' అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సాంకేతిక సమస్య కారణంగా నిలిచిపోయిన మైక్రోసాఫ్ట్ 365 యాప్‌లు, సర్వీసుల్లో సమస్యను పరిష్కరించామని ఈ సంస్థ ప్రకటించింది.

## భారత్‌లో ఏం జరిగింది?

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా దేశంలోని ప్రధాన రంగాలన్నీ ప్రభావితమయ్యాయి. విమాన సర్వీసుల దగ్గరి నుంచి దవాఖాన, బ్యాంకింగ్ వరకు ఇలా అన్ని సర్వీసుల్లోనూ సమస్యలు తలెత్తాయి. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, ఆకాశ, స్పైస్‌జెట్, విస్తారా తదితర ప్రముఖ విమానయాన సంస్థల సేవలపై దీని ప్రభావం పడింది. సాంకేతిక కారణాల వల్ల బుకింగ్, చెక్-ఇన్, బోర్డింగ్ పాస్ ఇష్యూయింగ్, ఫ్లైట్ స్టేటస్ చెకింగ్ తదితర సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఒక్క ఇండిగో విమానయాన సంస్థే 200కు పైగా విమాన సేవలను నిలిపేసింది. ఇక, బెంగళూరు ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 1 గుండా ప్రయాణాలు సాగిస్తున్న 90 శాతం విమానాలు నిలిచిపోయాయి. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్ విమానాశ్రయాల్లోని ఫ్లైట్ ఆపరేషన్లలో అంతరాయాలు కలిగాయి. కొన్ని ప్రైవేటు బ్యాంకులు, దవాఖానల్లోనూ సేవల్లో అంతరాయం ఏర్పడినట్టు నెటిజన్లు వెల్లడించారు. మైక్రోసాఫ్ట్‌కు చెందిన మైక్రోసాఫ్ట్ 365, మైక్రోసాఫ్ట్ టీమ్, మైక్రోసాఫ్ట్ అజూర్ సర్వీసులతో పాటు ఇన్‌స్టాగ్రామ్, అమెజాన్, జీమెయిల్ సేవల్లోనూ సమస్యలు ఎదుర్కొన్నట్టు పేర్కొన్నారు.

## ఏమిటీ 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్'?

కంప్యూటర్, లేదా ల్యాప్‌టాప్ స్క్రీన్ మీద హఠాత్తుగా ఓ బ్లూ స్క్రీన్ కనిపిస్తుంది. అందులో ఎర్రర్ మెసేజ్ ఉంటుంది. ఆ తర్వాత కంప్యూటర్ ఒక్కసారిగా షట్‌డౌన్ లేదా రీస్టార్ట్ అవుతుంది. ఈ సమస్యను 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్' లేదా 'బ్లాక్ స్క్రీన్ ఎర్రర్స్' లేదా 'స్టాప్ కోడ్ ఎర్రర్స్'గా పిలుస్తారు. సాధారణంగా హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సమస్యల వల్ల ఈ ఎర్రర్స్ తలెత్తుతుంటాయి. ఏదైనా హార్డ్‌వేర్‌ను కొత్తగా ఇన్‌స్టాల్ చేయడం వల్ల బ్లూ స్క్రీన్ ఎర్రర్ తలెత్తి ఉంటే.. సిస్టమ్‌ను షట్‌డౌన్ చేసి, హార్డ్‌వేర్‌ను తొలగించి రీస్టార్ట్ చేయాల్సి ఉంటుంది. తాజాగా విండోస్‌లో తలెత్తిన ఎర్రర్ సాఫ్ట్‌వేర్ సమస్య కిందకు వస్తుంది.

# ఫండ్స్ డైవర్షన్ కోసమే

(మొదటి పేజి తరువాయి)
అర్హులైన లబ్ధిదారులు.. రుణమాఫీ కాక.. అంతులేని ఆందోళనలో ఉంటే ఎందుకీ సంబరాలు? అని ప్రశ్నించారు. నలభై లక్షల మందిలో.. మెజారిటీ రైతులకు నిరాశే మిగిల్చినందుకా? ముప్పై లక్షల మందిని మోసం చేసినందుకా? ఈ సంబరాలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.రెండు సీజన్లు అయినా.. రైతు భరోసా ఇంకా షురూ చెయ్యలేదని... జూన్‌లో వేయాల్సిన రైతు భరోసా.. జూలై వచ్చినా రైతుల ఖాతాలో వేయలేదన్నారు. కౌలు రైతులకు.. ఇస్తానన్న రూ.15 వేలు ఇయ్యలేదని మండిపడ్డారు. రైతు కూలీలకు.. రూ.12 వేల హామీ ఇంకా అమలు చేయలేదన్నారు. మభ్యపెట్టే మీ పాలన గురించి.. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఇదివరకు అటెన్షన్ డైవర్షన్, ఇప్పుడేమో ఫండ్స్ డైవర్షన్ అన్నారు.

# కేసీఆర్ సర్కార్‌లో ఆర్థిక విధ్వంసం..

హైదరాబాద్, జులై 19,(జర్నలిస్ట్ వార్త):
కేసీఆర్ సర్కార్‌లో ఆర్థిక విధ్వంసం జరిగిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.జాతీయ పార్టీ పేరుతో రాష్ట్రాలతో గొడవలు పెట్టుకుందని విమర్శించారు.కేంద్రం నుంచి సరైన నిధులు తేలేక పోయారని మండిపడ్డారు. వాస్తవాలను బీఆర్ఎస్ నేతలు ఇంకా ఒప్పుకోవడం లేదని ఫైర్ అయ్యారు. ఈరోజు(శుక్రవారం) కరీంనగర్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, బీఆర్ఎస్‌ను వారే కూల్చుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ చేసిన తప్పులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. తాము గులాబీ పార్టీ లాగా గొప్పలకు వెళ్లడం లేదని స్పష్టం చేశారు. ధనిక తెలంగాణను గత సర్కార్ అప్పుల పాలు చేసిందని మండిపడ్డారు.రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి పోయారని ఎద్దేవా చేశారు.ఫోన్ ట్యాప్, ఇరిగేషన్,కరెంట్‌తో అరాచకాలు చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



# లష్కర్ బోనాలకు సిఎం రేవంత్‌కు ఆహ్వానం



హైదరాబాద్, జులై 19,(జర్నలిస్ట్ వార్త):
సికింద్రాబాద్ మహంకాళి బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని సిఎం రేవంత్ రెడ్డిని కమిటీ కోరింది. ఈమేరకు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సికింద్రాబాద్ మహంకాళి బోనాల ఉత్సవాలకు ఆహ్వానించింది.ఆలయ అర్చకులు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, తదితరులు సిఎంను కలిసిన వారిలో ఉన్నారు.

# స్టాఫ్ నర్సుల ఆందోళన

గోషామహాల్:
స్టాఫ్ నర్స్, హెడ్ నర్సుల బదిలీల కౌన్సెలింగ్‌లో అవకతవకలు జరిగాయని కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాలలో స్టాఫ్ నర్స్ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. దీంతో డైరెక్టర్ ఆఫ్ ఆఫ్ హెల్త్ రవీంద్ర నాయక్ కౌన్సిలింగ్‌ను తాత్కాలికంగా వాయిదా వేశా రు. ఈ నేపథ్యంలో స్టాఫ్ నర్సులు ఆగ్రహానికి లోనై అధికారుల తీరుపై విమర్శలు చేశారు. వైద్యవిభాగం తీరు కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాల రోడ్డుపైన ఆందోళనకు దిగా రు. ఒక్కసారిగా వందలాదిమంది స్టాఫ్ నర్సులు రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వాహనాలు బారులుగా నిలిచిపోవడంతో ఆ రోడ్డు పూర్తిగా దిగ్బంధనం చేసినట్టుగా మారింది. రం గంలోకి దిగిన పోలీస్ సిబ్బంది సంఖ్య లేకపోవడంతో వందలాది మంది స్టాఫ్ నర్సులను అదుపు చేయలేకపోయారు. మహిళా పోలీసులు సైతం లేకపోవడంతో పోలీసులకు వారిని అదుపు చేయడం జఠిలంగా మారింది. మరిన్ని బలగాలను తెప్పించుకోవడంలో అధికారులు తీవ్ర జాప్యం చేశారనే విమర్శలు వినిపించాయి. స్టాఫ్ నర్సులు తమ డిమాండ్లను వినిపిస్తూ ఆందోళన రాత్రి వరకు కొనసాగించారు.



# కాంగ్రెస్ రుణమాఫీతో వారికి నిద్రపట్టడం లేదు

## %బిఆర్ఎస్, బిజెపి నేతలు విమర్శలకు పనికి వస్తారు కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్, జులై 19,(జర్నలిస్ట్ వార్త):
కాంగ్రెస్ ప్రాక్టికల్ పార్టీ..కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రుణమాఫీ చేశారని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి అన్నారు. సోనియా గాంధీ, రాహూల్ బటన్ నొక్కితే సీఎం రేవంత్ రుణమాఫీ చేశారన్నారు. సినిమాల్లో రైతుల గురించి చూపించి డబ్బులు సంపాదించిన చిరంజీవి.. నల్లచట్టాల గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. నల్ల చట్టాలు తెచ్చిన మోడీకి మద్దతు ఇచ్చి.. రైతులకు అండగా ఉన్న రాహుల్ గాంధీకి మద్దతు ఎందుకు ఇవ్వలేదని అన్నారు.రుణమాఫీ చూసి బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు నిద్ర పట్టి ఉండదని జగ్గారెడ్డి పేర్కొన్నారు. కేటీఆర్‌కు ట్విట్టర్ పని తప్పా.. పనికి పనికిరాడని విమర్శించారు. మరోవైపు.. బీజేపీ



దగ్గర పనితనమే లేదు.. మాటలు తప్పితే అని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. బీజేపీ రైతులను కుని చేసి మర్డర్ చేసింది.. రైతులను నల్ల చట్టాలతో హత్య చేశారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ నేతల పిల్లలు రైతుల ద నుండి కార్లు తీసుకు పోయారు.. దీని ద కిషన్ రెడ్డి, బండి సంజయ్ మాట్లాడగలరా అని ప్రశ్నించారు. ఎండనక.. వాన అనక రైతులు ధర్నా చేస్త బీజేపీ నేతలు చంపలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.చిరంజీవి ఖైదీ నెంబర్ 150 సినిమా రైతుల ద తీశారు.. రైతులు ఆత్మహత్య చేసుకోవడం పై తీశారు.. సినిమా తీసిన హీరో చిరంజీవికి, నిర్మాతకు డబ్బులు వచ్చాయన్నారు. బీజేపీ రైతులు ఆందోళన చేస్తే కాల్చి చంపిన చిరంజీవి ఎందుకు ప్రశ్నించలేదని అన్నారు. రాహుల్ గాంధీ ప్రాక్టికల్ మనిషి.. వాస్తవాలకు దగ్గరగా ఉంటారని జగ్గారెడ్డి తెలిపారు. సోనియా గాంధీ కుటుంబంకి ఉన్న గొప్పతనం అదన్నారు. రాహుల్ గాంధీ సినిమాలో హీరోల లాగా నటించలేదు.. దేశం అంతా కాలి నడకన నడిచారని పేర్కొన్నారు. సినిమాల్లో రైతుల గురించి చేసే వాళ్ళు.. బయట మోడీకి మద్దతు ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు.

# స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు

హైదరాబాద్, జులై 19,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

తెలంగాణ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు సీఎం రేవంత్ పావులు కదుపుతున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాల శిక్షణను అందించాలన్నారు. అలాగే ఉద్యోగ అవకాశాలు కల్పించే సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, నిర్వహణకు ఎంత ఖర్చు అయినా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.స్కిల్ యూనివర్సిటీపై సచివాలయంలో జూలై 19, శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఢిల్లీ, హర్యానాలో ఉన్న స్కిల్ యూనివర్సిటీలను పరిశీలించి, తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర పరిశ్రమల విభాగం నమూనా ముసాయిదాను తయారు చేసింది. ఈ యూనివర్సిటీలో నిర్వహించే కోర్సులు,



వాటి వ్యవధి, నిర్వహణకు అవసరమయ్యే మౌలిక వసతులు, నిర్వహణకు అవసరమయ్యే నిధులు, వివిధ కంపెనీల భాగస్వామ్యంపై పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ప్రదర్శించారు. కొత్త యూనివర్సిటీకి 'తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ' అని పేరు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు.

హైదరాబాద్ లో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ క్యాంపస్ తో పాటు జిల్లా కేంద్రాల్లో ప్రాంతీయ ప్రాంగణాలు (శాటిలైట్ క్యాంపస్లు) ఏర్పాటు చేయాలనే చర్చ జరగింది. జిల్లా కేంద్రాల్లో శాటిలైట్ క్యాంపస్ లు ఏర్పాటు చేస్తే.. వాటిలో చేరే వారి సంఖ్య తక్కువగా ఉంటుందని, అందరూ హైదరాబాద్ క్యాంపస్ లో చేరేందుకు పోటీ పడుతారని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే హైదరాబాద్ లోనే అందరికీ శిక్షణను అందించేలా ఏర్పాట్లు చేయాలని, ఈఎస్సీతో పాటు న్యాక్ క్యాంపస్ ఉపయోగించుకోవాలని, అవసరమైన మౌలిక వసతి సదుపాయాలుండే వివిధ ప్రాంగణాలను గుర్తించాలని సూచించారు. భూదాన్ పోచంపల్లిలో ఉన్న స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ లో ఉన్న సదుపాయాలను అధికారులు స్వయంగా వెళ్లి పరిశీలించాలని సీఎం ఆదేశించారు.

# నెక్కొండ మండలంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సుడిగాలి పర్యటన







వరంగల్, జులై19,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద దేవి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్, జడ్పీహెచ్ఎస్ నెక్కొండ, బాలికల ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల వ్యవసాయ కార్యాలయం, అప్పలరావుపేటలోని ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, అలాగే ప్రాథమిక ఉన్నత పాఠశాల బొల్లికొండ, ప్రజా పాలన కేంద్రం, ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసి సమర్థవంతమైన నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు.

### ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి చక్కబెట్టాలి

నెక్కొండ మండలంలో దాదాపుగా ఉదయం నుంచి సాయంత్రం సమయం వరకు కలెక్టర్ పర్యటన కొనసాగించారు. గంటలపాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, పీహెచ్ సి సెంటర్, ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేయగా విధులపట్ల నిర్లక్ష్యం వహించి, అనధికారికంగా గైరాజరైన వైద్యాధికారికి, వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీస్ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వైద్యాధికారికోసం వేచి ఉన్న, కలెక్టర్ ఫోన్ లో మాట్లాడారు. ఆసుపత్రిలో పరిస్థితులు చక్కబెట్టాలని తహసీల్దార్ రాజ్ కుమార్ ని ఆదేశించారు.

### పాఠశాలలో ఒక్క విద్యార్థినీ ఇద్దరు ఉపాధ్యాయులు

బొల్లికొండ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా కేవలం ఒక విద్యార్థిని మాత్రమే పాఠశాలకు హాజరవడం పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు మెరుగైన విద్య భోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులు అందరూ ప్రతిరోజు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే ప్రాంగణంలో అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేయగా నమోదై ఉన్న 13 మంది విద్యార్థులు రోజు పాఠశాలకు వచ్చేలా పనిచేయాలని అంగన్ వాడీ నిర్వాహకులను హెచ్చరించారు. కెనాల్ కాల్వపై నుంచి విద్యార్థులను అంగన్వాడీకి పాఠశాలకు పంపించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. పర్యటనలో భాగంగా నెక్కొండ మండలానికి విచ్చేసిన కలెక్టర్ కి తెలుపుతూ, పెన్సింగ్ ఏర్పాటు చేయించాలని గ్రామస్థులు కోరారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### రుణమాఫీ వివరాలు పరిశీలించిన కలెక్టర్

తెలంగాణ రెసిడెన్సియల్ స్కూల్, నెక్కొండ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అప్పలరావుపేట పాఠశాలల్లో పారిశుధ్యం మెరుగపరిచి, అహ్లాదకరమైన వాతవరణం కల్పించాలన్నారు. నెక్కొండలో శిథిలా భవనంలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్నీ మరోచోటికి మార్చాల్సిందిగా సూచించారు. వ్యవసాయాధికారి కార్యాలయాన్ని సందర్శించి రుణమాఫీ కు సంబంధించిన వివరాలు పరిశీలించారు.

### గ్రామక్య సంఘం సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

తోపనపల్లిలో గ్రామైఖ్య సంఘం మహిళల సమావేశానికి జిల్లా కలెక్టర్ హాజరై మహిళలు గ్రామస్థాయిలో పరిశ్రమను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహిళలు కిరాణం దుకాణమో, మీ సేవాకేంద్రమో కాక ఏదో ఒక స్వయం ఉపాధిని ఎంచుకునేందుకు రుణాలు తీసుకోవాలని ఆలోచించాలని అన్నారు. వారి ఆలోచనలతోనే మార్పు రావాలన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పనతో ఆర్థికంగా ఎదిగేందుకు ముందుకు సాగాలని సూచించారు. స్థానికంగా దొరికే ముడి సరుకుతో ఉత్పత్తి కేంద్రాలను తయారు చేసుకోవాలన్నారు. గ్రామమంతా సమిష్టిగా ఆలోచించే దిశగా ముందకు సాగినతే అవసరమైన చర్యలను తీసుకుంటామని కలెక్టర్ మహిళలకు తెలిపారు.

### ప్రజాపాలన కేంద్రం తనిఖీ

నెక్కొండ మండల పరిషత్ కార్యాలయంలోని ప్రజాపాలన కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడి కోసం దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన వారితో మాట్లాడి పెండింగ్ సమస్యలేమైనా ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ తనిఖీల్లో తహసీల్దార్ రాజ్ కుమార్, ఎంపీడీవో వీరయ్య, ఆర్ఐ నరేందర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు తదితరులున్నారు.

# వ్యవసాయ భూముల్లో మైనింగ్

## పట్టపగలే యదేచ్చగా ఇసుక తవ్వకాలు







**వర్ధన్నపేట, జులై 19,(జర్నలిస్ట్ వార్త):** ఐనవోలు మండలంలో మైనింగ్ మాఫియా రోజురోజుకు పెరిగిపోతోంది. శుక్రవారం మండలంలోని లింగమోరిగూడెం గ్రామ శివారులోని నందనం ఆకేరు వాగు సమీపంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, అక్రమంగా వ్యవసాయ భూములను తవ్వుతున్నారు. ఆ భూముల్లో వెలువడుతున్న ఇసుకను తవ్వి, అమ్ముతున్నారు. ఒక్క ట్రాక్టర్ లోడ్ తరలిస్తే తవ్వకాలు చేసే వారు 17 వందల రూపాయలు తీసుకుంటున్నారు. ఇలా గత 6 నెలల సమయం నుండి ప్రతిరోజు ఇదే తంతు కొనసాగుతోంది. వందలాది ట్రిప్పులు ఇసుక తరలిస్తూ లక్షల్లో అక్రమ సంపాదన స్వాధీనం చేసుకుంటున్నారు. తవ్వకాలు చేస్తున్న స్థలం చుట్టుప్రక్కల రైతులు తలలు బాదుకుంటున్నారు. వ్యవసాయం చేస్తూ భూమిని పరిరక్షించుకుంటూ సహజీవనం కొనసాగిస్తున్న చుట్టుప్రక్కల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తవ్వకాలు చేయడం కారణంగా చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ భూములకు సంబంధిత హద్దురాళ్ళు తొలగిపోతున్నాయని చెబుతున్నారు. విద్యుత్ సౌకర్యం కోసం ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్థంభం పోళ్ళు కూలిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా తవ్వకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నా వారి నిర్వహణ వల్ల అనేకమంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ఇట్టి విషయమై పలుమార్లు స్థానిక అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆవేదన వ్యక్తపరిచినప్పటికీ ఫలితం లేకపోయిందని వివరిస్తున్నారు. ఈ తవ్వకాల నిర్వహణ కారణంగా వ్యవసాయ భూముల వద్దకు వెళ్లడానికి వీలుగా ఏర్పాటు చేసుకున్న దారి గుంతల మయంగా మారిపోయిందని ఆరోపిస్తున్నారు. ఆ ప్రాంతంలోని వ్యవసాయానికి సంబంధించిన రైతులు వెళ్లాలంటే ప్రమాదకరమైన పరిస్థితులు చోటు చేసుకున్నయని తెలుపుతున్నారు.

### సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారు..?

సంవత్సరాల తరబడి యదేచ్ఛగా మైనింగ్ తవ్వకాలు నిర్వహిస్తుంటే ఆకేరు వాగుతో పాటు పరిసర ప్రాంతంలోని వ్యవసాయ భూములు అంతరించిపోతున్నాయని లింగం కృష్ణమూర్తి తెలిపారు. తవ్వకాలు నిర్వహిస్తున్న చోటుకు ప్రక్కనే ఆయనకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు తెలిపారు. ఆ భూమికి హద్దు గుర్తింపుగా రాతిపోల్లు ఏర్పాటు చేస్తే, తవ్వకాల నిర్వాహకులు తమ భూమి అంచు వరకు ఇసుకను తవడంతో తన ఏర్పరచుకున్న రాతిపోలు కూలిపోయాయని ఆరోపించారు. ఇలా అద్దూ, అదుపు లేకుండా, ప్రభుత్వ అనుమతులు పని లేకుండా తవ్వకాల నిర్వహణ సమయం సందర్భం లేకుండా నిర్వహిస్తుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. మండల పరిధిలో కళ్ళముందే ఇసుక రవాణా జరుగుతుంటే అధికారులు ఎందుకు చూడడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయం, రైతుల పట్ల ఏమాత్రం పట్టింపు ఉన్నా.. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తవ్వకాల నిర్వహణక సంబంధించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలి, తవ్వకాల నిర్వహణతో ఇబ్బంది పడుతున్న రైతులకు ఉపశమనం కలిగించాలని రైతులు కోరుతున్నారు.

### జెసిబి అదుపులోకి తీసుకున్న ఎస్పై శ్రీనివాస్

ఎలాంటి అనుమతులు లేకుండా మండల పరిధిలో చేస్తున్న మైనింగ్ స్థలంలో తవ్వకాలు నిర్వహిస్తున్న ఓ జేసిబిని ఐనవోలు ఎస్సై శ్రీనివాస్ అదుపులోకి తీసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. తవ్వకాల స్థలంలో ఆ జెసిబి తో పాటు మరో రెండు జెసిబి లు పనిచేస్తున్నట్లు వారు గుర్తించారు. పరారీలో ఉన్న ఆ మిగతా రెండు జెసిబి లు త్వరలోనే అదుపులోకి తీసుకొని, సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తవ్వకాలు చేస్తే, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.





# నదులకు జలకళ



హైదరాబాద్, **జూలై 19 జర్నలిస్ట్ జర్నీ న్యూస్ :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా..గోదావరి నదుల్లో వరద ఉధృతి పెరుగుతూ వస్తోంది. తెలంగాణలో కూ డా పలు జిల్లాల్లో కుండపోత వర్షాలతో వాగులు వం కలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. మేడిగడ్డ బ్యారేజి వద్ద 3.41లక్షల క్యూసెక్కుల వరదనీరు చేరుతుండగా, 85గేట్లు ఎత్తివేసి వచ్చి న నీటిని వచ్చినట్టుగా దిగువకు వదిలిపెడుతున్నారు. త్రివేణి సంగమం జలకళను సంతరించుకుంది. వరదనీరు ఏడు మీటర్ల ఎత్తులో కొనసాగుతోంది.

ఎగువ నుంచి శ్రీరాం సాగర్ ప్రాజెక్టుకు 16110క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టులో నీటి నిలువ 16.96టిఎంసిలకు చేరుకుంది. కడెం ప్రాజెక్టులోకి కూడా 4156 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టులో నీటినిలువ 5.07టిఎంసీలకు పెరిగింది. శ్రీపాద ఎల్లంపల్లిప్రాజెక్టులోకి స్వల్పంగా 1405క్యూసెక్కుల నీరు చేరుతుండా గా ప్రాజెక్టులో నీటినిలువ 5.29టిఎంసీలకు చేరింది. చర్ల మండలంలోని తాలిపేరు జలశయానికి భారీగా వ రద చేరుతోంది. ప్రాజెక్టు 24గేట్లు ఎత్తివేసి 59330 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

### భద్రాచలం వద్ద 26 అడుగులకు నీటి

దిగువకు వెళుతున్న కొలది ఉపనదుల ద్వారా వస్తున్న వరదనీటితో భద్రాచలం వద్ద గోదావరి నదిలో నీటిమ ట్టం 26పెరిగింది. నదిలో నీటిమట్టం స్నా నఘట్టాలకు చేరుకుంది. 43అడుగులకు చేరితే మొద టి ప్రమాదహెచ్చరికను జారీ చేయనున్నారు. గోదావరికి వరద ప్రవాహాలు మరింత పెరుగుతాయని కేంద్ర జలవనరుల శాఖ హెచ్చరించింది. తుపాకుల గూడెం వద్ద సమక్కసాగర్ బ్యారేజీ మీదుగా 3.71లక్షల క్యూ సెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. దుమ్ముగూడెం వద్ద సీతారామసాగర్ వద్ద గోదావరిలో 3.47లక్షల క్యూసెక్కుల వరదనీరు ప్రవహిస్తోంది.

### శ్రీశైలంకు పెరిగిన వరద :

ఎగువన మహారాష్ట్ర , కర్ణాటక రాష్ట్రాల్లో కృష్ణనది పరివాహకంగా ఉన్న పలు ఉపనదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భద్ర నది ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తోంది. తుంగభద్ర ప్రాజెక్టులోకి 1.07లక్షల క్యూసెక్కుల వరదనీరు చేరుతొంది. ప్రాజెక్టులో నీటిమట్టం వేగంగా పెరుగుతూ వస్తోంది. శుక్రవారం సాయంత్రానికి జలశయంలో నీటినిలువ 59.80టిఎంసీలకు చేరుకుంది.ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఎగువనుంచి 61138క్యూసెక్కుల వరదనీరు చేరుతుండగా జలాశయంలో నీటినిలువ 101టిఎంసీలకు పెరిగింది. ప్రాజెక్టు గేట్లు ఎత్తివేసి 65వేలక్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదిలోకి వదులుతున్నారు.నారాయణపూర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 62వేలక్యూసెక్కుల నీరు చేరుతోంది. రిజర్వాయర్‌లో నీటినిలువ ఇప్పటికే గరిష్టస్థాయికి చేరుకుంది. నారాయణపూర్ ప్రాజెక్టు గేట్లు తెరిచి 68810క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. జూరాలకు వరద ఉధృతి పెరిగింది. ఎగువ నుంచి 65వేలక్యూసెక్కుల నీరు చేరుతుండగా ,రిజర్వాయర్ నుంచి 37905క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు కూడా వరద ప్రవాహం పెరిగింది. ఎగువ నుంచి 32673క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టులో నీటి నిలువ 33.11టిఎంసీలకు చేరింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 7063క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

### సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల:

తెలంగాణ రాష్ట్రంలో తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ఎడమకాలువకు శుక్రవారం నాడు నీటిని విడుదల చేశారు. రోజుకు 5000క్యూసెక్కువ చొప్పున నాలుగు రోజులపాటు మొత్తం 1.5టిఎంసీల నీటిని విడుదల చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు. మరో వైపు కుడికాలువకు కూడా నీటి విడుదల కొనసాగుతోంది.

# రాష్ట్రపతి పాలన అడుగుతాం

**వినుకొండలో హత్యకు గురైన రషీద్ కుటుంబాన్ని పరామర్శించిన జగన్**

**అనంతరం ప్రెస్ మీట్**

**ఈ నెల 24న ఢిల్లీలో సింబాలిక్ ప్రొటెస్ట్ చేపడతామని వెల్లడి**

**రాష్ట్రపతి, ప్రధాని మోదీ, అమిత్ షాలను కలుస్తానని వివరణ**



వినుకొండ **జులై 19,(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో ప్రజలకు పథకాలు అమలు చేయని చంద్రబాబు, వీటన్నింటి నుంచి దృష్టి మరల్చేందుకు ప్రజల్లో భయాందోళనలు సృష్టించే కార్యక్రమాలకు తెరలేపారని వైసీపీ అధ్యక్షుడు జగన్ అన్నారు. చంద్రబాబు ఈ మాదిరిగా దాడులు చేస్తూ, అన్యాయాలు చేస్తూ, దిగజారిన రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. "కచ్చితంగా వీటిపై నిరసన తెలియజేస్తాం. అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే సమయంలో తప్పకుండా అడ్డుతగులుతాం. రాష్ట్రంలో శాంతిభద్రతలపై గవర్నర్ ను నిలదీస్తూ, వైసీపీ గళం విప్పుతుంది.

ఆ తర్వాత వైసీపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ ఢిల్లీ వెళ్లి బుధవారం (జులై 24) నాడు సింబాలిక్ ప్రొటెస్ట్ చేపడతారు. ఏపీలో జరుగుతున్న దాడులు, శాంతిభద్రతల పరిస్థితుల గురించి దేశమంతా తెలిసేలా ఈ నిరసన కార్యక్రమం ఉంటుంది. అందులో భాగంగానే, ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ అపాయింట్ మెంట్ అడిగాం. అమిత్ షా, రాష్ట్రపతి అపాయింట్ మెంట్ కూడా తీసుకుంటాం. వీళ్లందరినీ కలిసి రాష్ట్రంలోని పరిస్థితులపై వివరిస్తాం. ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది అనే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళతాం" అని జగన్ స్పష్టం చేశారు.వినుకొండలో హత్యకు గురైన రషీద్ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం వైసీపీ అధినేత జగన్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అటవిక పాలన కొనసాగుతోందని అన్నారు. గత 45 రోజులుగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే, ఏ సామాన్యుడ్ని అడిగినా ఈ రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవనే చెబుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ వాళ్లయితే చాలు... వారు ఎవరినైనా కొట్టొచ్చు, ఎవరి ఆస్తులైనా ధ్వంసం చేయొచ్చు, ఎవరినైనా హత్య చేయొచ్చు, ఎవరిపైనైనా హత్యాయత్నం చేయొచ్చు, వారు ఏం చేసినా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తారు, బాధితులపైనే కేసులు పెడతారు అనే నీచ సంస్కృతి ఇవాళ రాష్ట్రంలో రాజ్యమేలుతోందని జగన్ వ్యాఖ్యానించారు. "చంద్రబాబు నాయుడి గారిని ఒకే ఒక్కటి అడుగుతున్నా. ఈ 45 రోజుల్లో 36 రాజకీయ హత్యలు జరిగాయి. 300కి పైగా హత్యాయత్నాలు జరిగాయి. టీడీపీ వాళ్ల వేధింపులు భరించలేక 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 560 చోట్ల ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేశారు.

ఇళ్లలో చొరబడుతున్నారు, ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు, షాపులు కాల్చివేస్తున్నారు, వైసీపీ సానుభూతిపరుల చీనీ తోటలు నాశనం చేస్తున్నారు. 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశారు. ఇవికాకుండా... 1000కి పైగా దౌర్జన్యాలు, దాడులు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి ఇదీ. రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా క్షీణించాయని చెప్పడానికి వినుకొండలో రషీద్ హత్య ఘటనే ఉదాహరణ. ఇంతకుముందు ఇక్కడ రవిశంకర్ రెడ్డి అని మంచి ఎస్పీ ఉండేవాడు. కానీ ఎన్నికల వేళ వీళ్లకున్న పలుకుబడితో ఆయనను తప్పించేశారు. ఆ తర్వాత వీళ్లకు కావాల్సిన బిందు మాధవ్ అనే అధికారిని తెచ్చుకున్నారు. ఈ బిందు మాధవ్ ఎంతటి అన్యాయస్తుడు అంటే, ఎన్నికల సంఘమే స్వయంగా జోక్యం చేసుకుని అతడ్ని తప్పించాల్సి వచ్చింది. ఆ తర్వాత ఎన్నికల సంఘమే మలికా గార్గ్ అనే మంచి ఆఫీసర్ ను తీసుకువచ్చింది. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ఆఫీసర్ ను కూడా పంపించివేశాడు. ఆ తర్వాత వీళ్లకు కావాల్సిన శ్రీనివాస్ అనే ఎస్పీని తెచ్చుకున్నారు. ఆ ఎస్పీ వచ్చిన రెండు మూడు రోజుల్లోనే ఈ హత్య జరిగింది. అత్యంత దారుణంగా, నడిరోడ్డుపై, అమాయకుడైన వ్యక్తిని అతి కిరాతకంగా నరికి చంపడం ప్రజలందరూ చూశారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ సానుభూతిపరులను ఇలాగే చంపుతామని సందేశం పంపినట్టుంది. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 కూడా పత్రికల ముసుగులో దిగజారిపోయాయి. హత్య చేసిన జిలానీ బైక్ ను గతంలో వైసీపీ వాళ్లు కాల్చేశారట... అందుకే ఈ హత్య జరిగిందని ఈనాడులో దిక్కుమాలిన అబద్ధం రాశారు. నిజంగా ఇవి పేపర్లా, టీవీ చానళ్లేనా? సిగ్గుతో తలదించుకోవాలి. వాస్తవానికి ఆ బైక్ ఆసిఫ్ అనే వైసీపీ మద్దతుదారుడిది. అప్పట్లో తన బైక్ తగలబెట్టారంటూ ఆసిఫ్ టీడీపీ నేతలపై కేసు పెట్టాడు. జరిగిన ఇన్సిడెంట్ ఇదీ. అది కూడా ఈ ఏడాది జనవరి 17న ఆ ఘటన జరిగింది. వ్యక్తిగత కారణాలతోనే హత్య జరిగిందని పోలీసులు కూడా సహకారం అందిస్తున్నారు" అంటూ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో చేసినట్టే... ఏపీలో రుణమాఫీ చేయాలి



అమరావతి **జులై 19,(జర్నలిస్ట్ వార్త)::**తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన వరం రుణమాఫీ అని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల కొనియాడారు. రుణమాఫీతో రైతుల కళ్లలో ఆనందం తిరిగి వచ్చిందని చెప్పారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన విధంగానే ఏపీ ప్రభుత్వం కూడా రుణమాఫీ చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. 15 ఏళ్ల క్రితం దేశ వ్యాప్తంగా ఒకే విడత రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని చెప్పారు. ఎన్నికల వేళ రాహుల్ గాంధీ చేసిన వాగ్దానం సాకారమయిందని... తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. రైతుల తలసరి అప్పులో తొలి స్థానంలో ఉన్న ఏపీలో రైతు రుణమాఫీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అన్ని విధాలుగా చితికిపోయిన రైతులకు రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరుతున్నామని చెప్పారు.

# రూ.2.50లక్షల కోట్లతో పద్దు?



హైదరాబాద్, **జూలై 19 జర్నలిస్ట్ జర్నీ న్యూస్ :** ఈనెల 25న శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా(2024-25) బడ్జెట్‌ను వాస్తవ అంచనాలను మాత్రమే తయారు చేసేలా అధికారులకు ఆదేశా లు జారీ చేసింది. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లపై స్పష్టత వచ్చిన తరువాత బ డ్జెట్‌పై పూర్తి స్థాయిలో కసరత్తు జరగనుంది. ప్రస్తుతఆర్థిక సంవత్సరం (2024- 25) బడ్జెట్‌ను వాస్తవ అంచనాలను తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆర్థిక శాఖకు సూచించింది. ఆదాయ, వ్యయాలపై భారీ అంచనాలతో కాకుండా, ఎంతమేరకు ఆదాయం వస్తుందనేది పక్కాగా లెక్కలు వేసి అంతమేరకే కేటాయింపులతో రూపొందించాలని నిర్దేశించింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పది సంవత్సరాల్లో ఒక్కసారి కూడా బడ్జెట్ అంచనాల ప్రకారం వంద శాతం వ్యయం చేయలేదు. ఈ ఏడాది ఆ లక్ష్యాన్ని సాధించేలా వాస్తవిక బడ్జెట్ ఉండాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. గత పదేళ్లలో 2019-20 లో మాత్రమే బడ్జెట్ అంచనాల్లో 97.5 శాతం వ్యయమైందని శ్వేతపత్రంలో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.ఈ ఏడాది రాష్ట్ర ఆదాయం, రుణాల సేకరణ పెరుగుతున్నందున బడ్జెట్ రూ.2.50 లక్షల కోట్ల వరకు చేరే కనిపిస్తున్నాయి. ఈ నెల 25 న శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ఆర్థిక శాఖ రాష్ట్ర ప్రభుత్వ అనుమతిని అడిగినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఆమోదించగానే అధికారులు తేదీని అధికారికంగా వెల్లడించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈనెల 23న పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెడుతున్నందున వెంటనే రాష్ట్ర బడ్జెట్‌కు నిధుల కేటాయింపుపై తుదిరూపు ఇవ్వనున్నారు. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు, బహిరంగ మార్కెట్ నుంచి సేకరించే రుణాలను కలిపి రూ.60 వేల కోట్లకు పైగానే ఉండవచ్చని ప్రాథమిక అంచనా.

# బిల్కిస్ బానో కేసులో దోషులకు షాక్




న్యూఢిల్లీజులై **19,(జర్నలిస్ట్ వార్త):** బిల్కిస్ బానో కేసులో ఇద్దరు దోషుల పిటిషన్‌ను సుప్రీం కొట్టివేసింది. రెమిషన్ వచ్చేవరకు తమకు బెయిల్ మంజూరు చేయాల్సిందిగా దోషులు సుప్రీంను ఆశ్రయించారు.కాగా అత్యున్నత న్యాయస్థానం శు క్రవారం ఈ పిటిషన్‌ను నిరాకరించింది. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం దీనిని పూర్తిగా తప్పుడు పిటిషన్‌గా పేర్కొంది. కోర్టులోని ఒక బెంచ్ జారీ చేసిన ఆర్డర్‌పై మరొక బెంచ్ ఎలా అప్పీల్ చేస్తారని ప్రశ్నించింది.కాగా దోషులు రాధేశ్యామ్ భగవాన్‌దాస్ షా, రాజుభాయ్ బాబూలాల్ సోనీ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి కోరగా దానికి బెంచ్ అనుమతించింది. షా మధ్యంతర బెయిల్ కోసం కూడా దరఖాస్తు చేసుకున్నారు.2002లో గోధ్రా రైలు దహనకాండ అనంతరం గుజరాత్‌లో పెద్దఎత్తున చోటుచేసుకున్న మతపరమైన అల్లర్లలో బిల్కిస్ బానో కుటుంబానికి చెందిన ఏడుగురు సభ్యులు హత్యకు గురయ్యారు. 5 నెలల గర్భిణిగా ఉన్న బానోపై దుండగులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు.

# ఉత్సాహంగా ఆల్ ఫోర్స్ పాఠశాలలో హౌజ్ ఎలక్షన్స్



వర్ధన్నపేట, జులై 19,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఆల్ ఫోర్స్ పాఠశాలలో హౌజ్ ఎలక్షన్ ప్రక్రియ నిర్వహించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశాలలో ఎన్నికలు కీలకమన్నారు. ఎన్నికల ద్వారానే సమర్థ పాలన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజలకు కావల్సిన అభివృద్ధి ఫలాలను, అత్యధికంగా అందజేయవచ్చని తెలిపారు. ఎన్నికలు ప్రజల మనోభావాలకు దర్పణం అని చెప్పారు. ఎన్నికల ద్వారానే ప్రజలు వారికి కావల్సిన అవసరాలను తీర్చుకోగల్గుతారని, ఉత్తమమైన వ్యక్తిని ఎన్నుకోడానికి, బలపర్చడానికి ఒక అత్యుత్తమ వేదికగా చెప్పారు. ప్రజాస్వామ్య దేశంలో ఓట్లు చాలా కీలకంగా వ్యవహరిస్తాయని నాయకుల భవితవ్యాన్ని తేల్చి చెప్పేది ఎన్నికే అన్నారు. విద్యార్థులకు ప్రాథమిక దశనుండే ఎన్నికల పట్ల అవగాహన కల్పించడానికి, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ప్రతి సంవత్సరం ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సంవత్సరం రెట్టింపు ఉత్సాహంతో పాఠశాలలోని వివిధ విభాగాల కెప్టెన్స్, వైస్ కెప్టెన్లకు ఎన్నికలు, ఎన్నికల వాతావరణం కల్పించే విధంగా నిర్వహించడం కొనసాగిందని చెప్పారు. పాఠశాలలోని తేజస్, సరస్, ధృవ, లక్ష్య విభాగాలకు బాలబాలికలకు వేరు వేరుగా ఎన్నికల పోటీలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రారంభానికి ముందు వారు విద్యార్థులకు ఎన్నికల విశిష్టత, ఓటు హక్కు నిర్వర్తించే తీరు స్పష్టంగా తెలియజేశారు. పాఠశాలలోని "తేజస్", "సరస్", "ధృవ" మరియు "లక్ష్య" విద్యార్థులు నాయకత్వ లక్షణాలను బలపర్చడానికై ప్రత్యేక నాటికను రూపొందించి, ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థులు వారి ఉత్సాహాన్ని ప్రదర్శించి, పోటీలో పాల్గని, కేటాయించిన గుర్తులను ప్రచారం చేసుకొని ఓట్లను అభ్యర్థించారు. ప్రత్యేకంగా వారు ప్రదర్శించిన ఓటు విలువైన హక్కు, ఓటు వేయకపోతే భవిష్యత్తు కోల్పోతామని కార్యక్రమంలో ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# దీపావళికి అమరన్

శివకార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న ‘అమరన్’ చిత్రం దీపావళి కానుకగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ విషయాన్ని మేకర్స్ బుధవారం ప్రకటించారు. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మిస్తున్నారు. సాయిపల్లవి కథానాయిక. శివ్ అరూర్, రాహుల్‌సింగ్ రాసిన ‘ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్’ అనే పుస్తకంలోని ‘మేజర్ వరదరాజన్’ పాత్ర ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. కశ్మీర్ నేపథ్యంలో నడిచే ఈ యాక్షన్ డ్రామాలో శివకార్తికేయన్ ఆర్మీ మేజర్ పాత్రలో కనిపిస్తారు. అత్యుత్తమ సాంకేతిక విలువలతో దేశభక్తి ప్రధానంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని మేకర్స్ తెలిపారు



## కల్కి 2898 ఏడీ లైన్‌లో మరో సినిమా..

# అనసూయ అరిపై క్రేజీ న్యూస్!


టాలీవుడ్‌లో భక్తి సినిమాలకు ఎలాంటి ఆదరణ ఉంటుందనేది ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. దేవుళ్ల మీద సినిమాలు వస్తున్నాయంటే ప్రత్యేకించి ఎదురుచూసే మూవీ లవర్స్ సంఖ్య భారీగానే ఉంటుంది. సినిమాల కథానుగుణంగా దేవుడిని ఏ రూపంలో చూపించినా ఆ సినిమాలు బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్నాయి. సోషియో ఫాంటసీ నేపథ్యంలో సాగే అఖండలో శివుడు, హనుమాన్‌లో హనుమంతుడు, కల్కి 2898 ఏడీలో కృష్ణుడిని చూపించిన తీరుకు జనాలు నీరాజనాలు పలుకడమే బాక్సాఫీస్ వద్ద రికార్డుల మోత మోగించాయి. ఈ సినిమాకు పార్టు 2లు కూడా రాబోతున్నాయంటే ఈ జోనర్ సినిమాలకు క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కాంతార, కార్తికేయ 2, ఓ మై గాడ్ సినిమాలు కూడా మంచి ప్రేక్షకాదరణ పొందాయి. ఇక టాలెంటెడ్ నటి అనసూయ భరద్వాజ్ (%కాఅఖుంబఖు ఎఖతీఖుంఖుయ%) లీడ్ రోల్‌లో నటించిన సినిమా కూడా ఇదే లైన్‌లో రాబోతుందన్న వార్త ఇప్పుడు ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. పేపర్‌బాయ్ ఫేం జయశంకర్ డైరెక్టర్ చేస్తున్న సినిమా కూడా సేమ్ థీమ్‌తో ఉండబోతుందట. తాజా టాక్ ప్రకారం కల్కి 2898 ఏడీలో హైలెట్‌గా నిలిచినట్టుగానే.. అరి టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రంలో కూడా కృష్ణుడిదే లీడ్ రోల్ అని జోరుగా టాక్ నడుస్తోంది. చాలా రోజుల క్రితమే ప్రకటించిన అరి చిత్రం మళ్లీ తాజా అప్‌డేట్‌తో నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. ఎవరూ టచ్ చేయని విధంగా అరిషడ్వర్గాలనే ఇతివృత్తం నేపథ్యంలో మూవీ సాగనుందని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఈ చిత్రంలో సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్, శుభలేఖ సుధాకర్, వైవా హర్ష ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# ‘పుష్ప’ రాజ్‌కు పోటీగా వస్తున్న ‘కన్నప్ప’..

టాలీవుడ్ నటుడు మంచు విష్ణు ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం ‘కన్నప్ప’ మోహన్ బాబు నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అత్యంత భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్ విడుదల చేయగా హాలీవుడ్ లెవల్లో ఉన్న ఈ టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. అయితే ఈ సినిమా విడుదల తేదీపై తాజాగా ఒక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాను డిసెంబర్‌లో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే మంచు విష్ణు భారీ సాహసం చేయబోతున్నాడు. ఎందుకంటే ఇప్పటికే డిసెంబర్‌ను బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్ బుక్ చేసుకుంది. ముఖ్యంగా టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా మోస్ట్ అవైటెడ్ మూవీ పుష్ప ది రూల్ రాబోతుంది. డిసెంబర్‌లో ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. అయితే ఈ సినిమాకు పోటీగా కన్నప్పను దించడం అనేది సాహసం కూడుకున్న పని అని ఇది కన్నప్పకు ఎఫెక్ట్ పడే అవకాశం ఉందని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. కాగా కన్నప్ప విడుదల తేదీపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.







# బజ్ రాలేదు.. అల్లు శిరీష్ వెనక్కి

టాలీవుడ్ అగ్ర నిర్మాత అల్లు అరవింద్ పెద్ద కొడుకు అల్లు అర్జున్ టాలీవుడ్లోనే కాదు ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలోనే బిగ్గెస్ట్ స్టార్లలో ఒకడిగా ఎదిగాడు.కానీ అరవింద్ చిన్న కొడుకు అల్లు శిరీష్ మాత్రం కెరీర్ మొదలైన పదేళ్ల తర్వాత కూడా తడబడుతూనే ఉన్నాడు. శ్రీరస్తు శుభమస్తు, ఊర్వశివో రాక్షసివో సినిమాలు ఓ మోస్తరుగా ఆడినా అతడి కెరీర్ మాత్రం అనుకున్నంతగా ఊపందుకోలేదు. ఊర్వశివో రాక్షసివో తర్వాత శిరీష్ ఎంతో గ్యాప్ తీసుకుని బడ్డీ అనే సినిమా చేస్తే.. ఇది జనాల దృష్టిలోనే పడడం లేదు. మేకింగ్ దశలో టీం చాలా సైలెంటుగా ఉండిపోయింది. సినిమా ఫస్ట్ కాపీ తీశాక నేరుగా ట్రైలర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అప్పుడే ఈ సినిమా రిలీజ్ డేట్ కూడా ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం జులై 26న బడ్డీ ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది.ఐతే ట్రైలర్ లాంచ్ చేసి, రిలీజ్ డేట్ ప్రకటించాక కూడా ఈ సినిమా గురించి ఎక్కడా చర్చే లేకపోయింది. రిలీజ్ డేట్ దగ్గర పడ్డా సోషల్ మీడియాలో సౌండ్ లేదు. ఈ చిత్రానికి బిజినెస్ కూడా ఆశించిన స్థాయిలో జరగలేదని.. పైగా కల్కి లాంటి పెద్ద సినిమా తర్వాత టాలీవుడ్లో వాతావరణం కొంచెం స్తబ్దుగా మారిపోవడంతో వేరే సినిమాల వైపు ప్రేక్షకులు చూడట్లేదనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ వారం రిలీజవుతున్న డార్లింగ్ గురించి కూడా పెద్దగా ప్రేక్షకుల్లో డిస్కషన్ లేదు. ఈ నేపథ్యంలోనే బడ్డీ మూవీని వారం వాయిదా వేసి ఆగస్టు 2న రిలీజ్ చేయాలని డిసైడైనట్లు తెలుస్తోంది. కొత్త డేట్‌తో పోస్టర్ కూడా బయటికి వచ్చింది. అప్పటికైనా సినిమాకు ఆశించిన హైప్ వస్తుందా.. రిలీజ్ ముంగిట ప్రమోషన్ల హడావుడి పెంచి సినిమా పేరు జనాల్లో నానేలా చేస్తారా.. చూడాలి మరి.